# వికృతరూపం

శొంఠి జయప్రకాష్

నేనూ మనిషినే.

కానీ... నా రూపం చూస్తే అలా ఎవరూ అనుకోరు.

నేను మరీ చాలా పొట్టిగా వుంటాను. మోకాళ్ళ దగ్గర నుండి కాలి బొట నవేలి వరకూ, నా రెండు కాళ్ళూ వంకర తిరిగుంటాయి. కుడి పాదం వేళ్ళు ఎడమ వైపు ఎడమ పాదం వేళ్ళు కుడివైపు మెలి తిరిగి ఉంటాయి. మోకాళ్ళ మధ్య చాలా ఎడం వుంటుంది. నడుము నుండి మెడ మొదలు వరకు వెన్నుముక విల్లులా ముందుకు వంగి ఉంటుంది. నేను పుట్టిన తరువాత మొలిచాయా అన్నట్లుగా నా చేతులు నాచుగా, కురచగా ఉండి భుజాలకు వేళ్ళాడుతున్నట్లుంటాయి. దవడలు పెద్దగా ఉండి, పళ్ళు నోటి నిండుగా, వంకర టింకరగా ఉంటాయి. కళ్ళు పెద్ద పెద్దగా ఉండి గుడ్లగూబను తలపించి భయం గొలుపుతూ ఉంటాయి.



ఇన్ని అవకరాలున్న నన్ను యెవరైనా మనిషి నను కుంటారా ? అవి దేవుడిచ్చాడు కానీ, అందులో నా తప్పేమీ లేదు కదా ?

కానీ ... నేను మనిషిని కాదేమోనని జనం నన్ను చూసి జడుసుకుంటారు. దూరంగా తొలగి పోతారు. జనం అలా ప్రవర్తిస్తే నాకు చాలా బాధ వేస్తుంది. అలా బాధ పడీ, బాధ పడీ నాకలవాటైపోయిందిలెండి. ఎందుకంటే ఆ బాధ భరించ గలిగేది కనుక. కానీ ఆకలి బాధను ఎలా భరించేది ? దాన్ని తీర్చుకోవాలే తప్ప, భరించ నలవికానిది.

అందుకే గుండె రాయి చేసుకుని, కడుపు చేత పట్టు కుని, ఒక ప్లాస్టిక్ ఫోల్డరలో ఉన్న కాగితాలు చంకలో పెట్టుకుని, పనిముట్టు పట్టుకున్న వృత్తి కార్మికునిలా, భిక్షాటనకు బయలు దేరానిప్పుడు.

'భిక్షాటనకు బయలు దేరుతున్నానిప్పుడు' అని చెపు తున్నానంటే, నిజంగా నన్ను వీధుల్లో భిక్షం అడుక్కునే వాణ్ణనుకునేరు. నేను చేసే వృత్తికి ఏ పేరు పెట్టాలో తెలి యక అలా అన్నానంతే. ముందు ముందు నా వృత్తి పేరు తెలియగలదేమో!

అన్నట్టు పూర్వజీవిత వాసనల ప్రభావం చేత నాకు కొంచెం ఆత్మాభిమానం అలవడింది.

నా చంకలోని ప్లాస్టిక్ ఫోల్డరులో ఉన్న కాగితాలు నా దృష్టిలో చాలా చాలా విలువైనవి. యూనివర్శిటీల్లో ఇచ్చే డిగ్రీ సర్టిఫికెట్ల కన్నా ఎక్కువ విలువైనవి.

నేను నివసించే ఊర్లోని ప్రముఖులు, దయాగుణ సంపన్నులు, ముఖ్యంగా ఆర్థోపీడిక్ వైద్యులు దాతల నుద్దేశించి రాసిచ్చిన విజ్ఞప్తులవి. అంటే నా గురించి, నా వ్యధిత శరీర దురవస్థ గుర్తించి, వారికి తోచిన సహాయా న్నందించడమే కాక, ఇతర దయార్ద్ర హృదయులు నాకు సహాయమందించాలనీ, నాకు చేయూత నివ్వాలనీ విజ్ఞప్తి చేస్తూ ఇచ్చిన సర్టిఫికెట్లన్నమాట అవన్నీ. వాటిన న్నింటినీ, భద్రంగా, ప్రాణప్రదంగా ఆ ప్లాస్టిక్ ఫోల్డరు లోనే దాచుకున్నాను.

వాటిని వివిధ సంస్థల్లో ఆఫీసుల్లో పనిచేసే ఉద్యోగు లకు చూపించి డబ్బు సహాయం చేయమని అభ్యర్థి స్తాను. ('అడుక్కోవడం' అనేది మరోపేరు) నా అభ్యర్థన లకు దయతలచి కొంతమంది డబ్బులిస్తారు. కొందరు ఇవ్వకపోగా చీదరించుకుంటారు. వారికి నెలవారీ జీతాలు తప్పకుండా ఠంచనుగా వస్తాయి కాబట్టి, అట్లాంటి చోట్లకే టార్గెట్ పెట్టుకుంటాను.

కానీ ఇందులో పెద్ద అడ్డంకి ఉంది. ఆఫీసు ఉద్యోగస్తు లతో కలవాలంటే ముందుగా, ఆ ఆఫీసు హెడ్డు అను మతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇదో పెద్ద సమస్య. కానీ అది ముఖ్యం. అందుకే నా వికృత రూపంతో ఒక చింపా జీలా నడుస్తున్నాను.

ప్రస్తుతం నా యీ ప్రయాణం, అధునాతన నానికి మారుపేరైన ఒక పెద్ద కార్పొరేట్ ఆఫీస్‌కు. చిన్న చిన్న ఆఫీసుల్ని ఎన్ని సార్లు దర్శించినా ఫలం అంతంత మాత్రంగానే ఉంది. ఒక్క ఆఫీసు సిబ్బందైనా నా పెళ్ళాం పిల్లలు

కడుపు నిండా భోంచేసేటంత సహాయం చేయలేదు. నాకు పెళ్ళాం పిల్లలున్నారా? అని ఎవరైనా ఆశ్చర్యపోవచ్చు. గంతకు తగ్గ బొంత చందాన వున్నారులెండి. నేనూ మనిషినే అని ఇంతకు ముందే మనవి చేసుకున్నాను. వారి కడుపు నిండాలంటే ఏనుగు కుంభ స్థలాన్ని కొట్టాలని పెద్ద కార్పొరేట్ ఆఫీసుకు వెళుతున్నాను.

మీకు ఒక విషయం చెప్పడం మరిచా. నాకు కొంచెం రాయడం, చదవడం వచ్చు. ఒక దయా గుణశీలి నన్ను ఒక కోఆపరేటివ్ సొసైటీలో స్వీపరుగా పనికి కుదిరించాడు.ఆ సొసైటీ సెక్రటరీకి, సిబ్బందికి నా వికృత రూపం నచ్చలేదు. అందుకే అంతా కలిసి కుట్ర పన్నారు నా మీద. రైతుల చెక్కులను ఫోర్జరీ చేసినట్లు రికార్డులు సృష్టించారు. డెబిట్ ఓచరు మీద వాళ్ళే దొంగ సంతకం పెట్టి, అది నేనే చేశానని తప్పుడు అభియోగం మోపారు. జైలుకు పంపిస్తామని బెదిరించారు. జైలుకు వెళ్ళకుండా ఉండాలంటే రాజీనామా పత్రం మీద సంతకం చేయమన్నారు. ఎటూ తప్పించుకుపోకుండా పటిష్టమైన ఉచ్చు బిగించడంతో నేను విధిలేక రాజీనామా పత్రం మీద సంతకం చేశాను. అంతటితో నా ఉద్యోగం పోయింది.

నా ఉద్యోగం ఊడటానికి ముఖ్య కారకుడైన సెక్రటరీ చెంపను ఛెళ్ళు మనిపించి వాళ్ళకు దొరక్కుండా తప్పించుకు పారిపోయాను. నా ఉద్యోగం పోయిందన్న బాధకంటే ఫోర్జరీ చేశానంటూ తప్పుడు అభియోగం నాపై రుద్దడమే నన్ను అమితంగా బాధిస్తోంది.

గతంలో నేను అంతో ఇంతో నెలజీతం తీసుకునేవాణ్ణి కాబట్టి , ఇతర పనులు చేయడానికి నా వికృత ఆకారం ఆటంకంగా ఉంది గనుక ఇలా భిక్షాటన తప్ప పొట్ట గడుపుకోవడానికి మరో దారి కనబడకపోయింది.

అదుగో నేను చేరుకోబోయే గమ్యం దగ్గర పడింది. ఎంతో ప్రయాసకోర్చి నా బాధాతప్త శరీరాన్ని ఆ కార్పొరేట్ ఆఫీసుమెట్ల దగ్గరికి చేర్చ గలిగాను. ఆ మెట్లు కేవలం నాలుగంటే నాలుగే ఉన్నాయి. అయితే... అవి నా పాలిట నలభై మెట్లుగా అనిపించాయి.

ఆ ఆఫీసొక పెద్ద భవంతిలో ఉంది. ఆ భవంతికి తగిలించిన పెద్ద సైన్ బోర్డు మీద 'గ్లోబల్ ఫైనాన్సింగ్ అండ్ అడ్వర్ టైజింగ్ ఏజెన్సీ' అని అందమైన అక్షరాలతో రాసి ఉంది. అక్షరాల కింద బ్రాకెట్లలో 'సంపూర్ణ కంప్యూటరీకరణ చేయబడినది' అని రాసి ఉంది.

కొన్ని కోట్ల రూపాయల మేర లావాదేవీలు జరిపే సంస్థ అది. నాకేమో కామధేనువులా కనబడింది.

ఎలాగైతేనేం! ఆ నాలుగు మెట్లెక్కి లోపలికి ప్రవేశించాను. కొలాప్సబుల్ గేటు వద్ద సెక్యూరిటీ



గార్డు లేడు. నా అదృష్టం బాగుందని ఆనందించాను. ఆఫీసులో అడుగుపెట్టిన నా ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. లోపల ఆఫీసుకు చేసిన డెకరేషన్ చూసి కళ్ళు తిరిగి పోయాయి. ఇంద్ర భవనమంటారే , అలాగుంది.

కంప్యూటర్ల ముందు సిబ్బంది అధునాతన దుస్తులు ధరించి, రెప్పవేయని దేవతల్లా వెలిగిపోతూ తదేకంగా పని చేసుకుంటున్నారు. ఆ కళ్ళల్లో కరుణ రసం పొంగి పోతున్నట్లనిపించింది. వాళ్ళను కలిసి నాగోడు చెప్పుకుని డబ్బు సాయం అడగాలంటే ఆఫీసు హెడ్డు అనుమతి తప్పనిసరిగా పొందాలికదా. గ్లాసు డోరు మెల్లగా తెరుచుకుంటూ, నిర్భయంగా, నిస్సంకోచంగా మేనేజరు గదిలోకి ప్రవేశించాను. టేబులు మీదున్న నల్లని నేమ్ బోర్డు మీద కే.డీ.కాశీనాథ్, మేనేజర్ అన్న తెల్లటి ఇంగ్లీషు అక్షరాలు మెరిసి పోతున్నాయి.

మేనేజరు కాశీనాథ్ ఫుల్‌సూటులో నీటుగా, ఫ్రెష్‌గా, దర్పంగా కనబడుతున్నారు. ఆయన అణువణువునా ఆనందం, ఆహ్లాదం, సంతృప్తి తొణికిసలాడుతున్నాయి. ఆయన పెదాల మీది చిరునవ్వుతో, ఖరీదైన కుర్చీలో కూర్చున్నారు. ఆయన క్యాబిన్‌లో అత్యంత అధునాతన అలంకరణ. కింద కార్పెట్‌పైన ఫర్నీచర్.. టేబులు ఎదురుగా కొన్ని కుర్చీలు, కుడి యెడమల అత్యంత ఖరీదైన సోఫాలు ఉన్నాయి. వాటికి పట్టుబట్టలతో చేసిన తొడుగులున్నాయి. మాసిన బట్టలతో, వికృత జంతువులాగా ఉన్న నేను లోపలకు ప్రవేశించగానే, అకస్మాత్తుగా దేవుని గుడిలో అడుగుపెట్టిన అస్పృశ్యుణ్ణి చూసిన పూజారిలా మేనేజరుగారు అదిరి పడ్డారు. అసహ్యంగా ముఖంపెట్టి

''ఏయ్! ఎవరు నువ్వు ? యేం కావాలి ? ఇలా ఎవరు పడితే వాళ్ళు నా గదిలోకి రాకూడదు, వచ్చే ముందు పర్మిషన్ తీసుకోవాలి. అసలు నువ్వు లోపలికెలా వచ్చావు ? ఎంత ధైర్యం ? ఎవరున్నారు బయట ? సెక్యూరిటీ ... సెక్యూరిటీ ...'' అంటూ మేనేజరుగారు గాభరాపడిపోతున్నారు..నేనేదో ఘోరమైన నేరం చేసినట్టు.

నేను ఆయన కంగారునూ, అసహ్యాన్ని, గాభరానూ, పట్టించుకోకుండా, దేవునికి నమస్కరిస్తున్న భక్తుడిలా నమస్కరించాను. ప్లాస్టిక్ ఫోల్డరును విప్పిఅందులోని కాగితాలను ఒక్కొక్కటిగా చూపించసాగాను వినయంగా. ఆ సర్టిఫికేట్లు లిఖించి ఇచ్చిన దాతలను గురించి చెప్పసాగాను.


తొక్కి ఉంచిన స్ప్రింగులాగా మనసులో అయిష్టాన్ని, అసహ్యాన్ని, అసహనాన్ని అణిచి పెట్టుకుంటూ పేపర్లవంక చూస్తూ యాంత్రికంగా నా మాటలు వినసాగాడు.

''వైట్ కాలర్ టైప్ ఆఫ్ బెగ్గింగ్'' పైకి వినబడేట్టుగా గొణుక్కున్నారు కాశీనాథ్‌గారు.

''ఎన్నో యేళ్ళ నుండీ కష్టపడి ఆర్జించుకున్న కంపెనీ ఇమేజీనీ, నాలాంటి ఆఫీసర్ల ప్రిస్టేజీని డ్రైనేజీలో కలపడానికే ఇలాంటి బెగ్గర్స్ ఖరీదైన కార్పొరేట్ ఆఫీసులకొస్తారు. లేజీ ఫెలోస్! యూజ్ లెస్ ఫెలోస్! బెగ్గింగ్ కోసం ఎవరెవరివో కాళ్ళూ కడుపులూ పట్టుకుని యోగ్యతా పత్రాల్లాగా, లైసెన్సుల్లాగా ఇలాంటి కాగితాలు రాయించుకొచ్చి డబ్బులిమ్మని ప్రాణాలు తోడేస్తారు. ఆఫీసు హెడ్డు అను

# ఫలశ్రుతి

వేళ్ళ సందుల్లోంచి నిత్యం
జారిపోతున్న కాలాన్ని
మడతపెట్టి జేబులో
భద్ర పరచుకోగలనా



స్కూలు పుస్తకాల్లో
నెమలీకల్లాదాచుకున్న
బాల్యాన్ని తిరిగి
పొందగలనా

ఎంబ్రాయిడరి చీరలా
నక్షత్రాల్తో మెరుస్తోన్న
ఆకాశాన్ని కత్తిరించి
నా భార్యకు ఇవ్వగలనా

ఎన్ని నొప్పులు పడితే ఒక
సుఖప్రసవ మౌతుంది
ఎన్ని మలుపులు తిరిగితే
బ్రతుకు గమ్యం చేరుతుంది

ఎన్ని కడవల నీళ్ళు పోస్తే
ఒక వర్షం అవుతుంది
ఎన్ని రాత్రులు నిద్ర కాస్తే
ఒక కావ్యం పూర్తవుతుంది.

-భూషి కృష్ణదాసు

మతి తీసుకుని రైట్ రాయల్‌గా సిబ్బందిని డబ్బివ్వమని వేధిస్తారు. ఇలాంటి వారికి అనుమతిస్తే నా ఇమేజీ స్టాఫ్ ముందు డ్యామేజైపోదా ? ఎంతో కష్టపడి పరిశుభ్రంగా ఉంచుకున్న ఇంటి లోపలికి ఒక పేడ పురుగువస్తే ఊరుకుంటామా ? చీపురుతో చిమ్మి అవతలకు విదిలించి కొడతాం. అలాగే వీడిని బయటకు తరిమి కొట్టాలి'' గొణుక్కుంటూ ఉన్నా ఆ మాటలు నాకు వినిపిస్తున్నాయి.

''ఆరేయార్! సెక్యూరిటీ వాలా కహా గయా హై?'' అరుస్తూనే ఉన్నారు కాశీనాథ్ గారు. సెక్యూరిటీవాళ్ళు ఉంటేగా రావడానికి ?

నేను మేనేజరుగారిని ప్రాధేయపడుతున్నాను. ''తమలాంటి దయగల మహానుభావులు నా అంగ వైకల్యం చూసి జాలిపడి తోచిన సాయం చేశారు సార్. మీరు కూడా ఈ దీనుణ్ణి కనికరించి అనుమతిచ్చారంటే, మీ సిబ్బందిని అప్రోచ్ అవుతాను''.

''నాట్! వీల్లేదు.'' కాశీనాథ్ మనసు కరగలేదు.

నా ఒంట్లో శక్తిలేక నిలబడలేకున్నాను. తూలిపడబోతుండగా, సపోర్టుకోసం కుర్చీ బ్యాక్‌రెస్టును పట్టుకుని నిలదొక్కుకున్నాను.

''సార్! రెండు రోజులైంది అన్నం తిని. నా పెళ్ళాం పిల్లలకీ పూటైనా ఇంత తిండి పెట్టాలనే ఆశతో, నమ్మకంతో మీ దగ్గరకొచ్చాను, మీరు పెద్ద మనసు చేసుకోవాలి.. పెద్ద మనసు...చేసు...కో...వాలి.. నా గొంతు తడారిపోతోంది. కళ్ళు కూడా తిరుగుతున్నాయి. ''ప్రతీ బెగ్గరూ ఇలాగే అంటారు, నీలాంటి వాళ్ళని ఎంతమందిని చూడలేదూ? నా సమయాన్ని వృధాచేయొద్దు. నీవు చూపిస్తున్న సర్టిఫికేట్లనబడే ఈ చెత్త కాగితాలు వట్టి బూటకం. నువ్వాడుతున్నది నాటకం.

ఈ కాగితాలమీది పెద్ద మనుషుల సంతకాలు నువ్వే ఫోర్జరీ చేసుంటావు. నీలాంటి ఫ్రాడ్యులెంట్స్, కల్‌ప్రిట్స్ యెంతకైనా తెగిస్తారు. గెటౌట్! గట్టిగా అరిచాడు.

ఆ దయలేని , అబద్దపు మాటలకు దెబ్బతిన్న అమాయకపు పక్షిలా గిలగిల్లాడాను.

''సార్! సార్ ! సార్ ! అంత మాటనకండి, ఈ కాగితాలు ఫోర్జరీవి కావు, నిజమైనవి. నేనలాంటి వాణ్ణి కాను. నేనెలాంటి ఫోర్జరీకీ పాల్పడలేదు,'' ప్రాధేయపడ్డాను.

''యూ రాస్కెల్ ! చెప్పేది నీక్కాదూ ? గెటౌట్'' ఆ అరుపులకు క్యాబిన్ దద్దరిల్లింది. నా కళ్ళల్లో నుండి నీల్ళు జలజలా రాలాయి. నా గుండెల్లో పదునైన కత్తి దింపినా నేనంత బాధ పడేవాడిని కాదు. 'సంతకాలు నువ్వే ఫోర్జరీ చేసుంటావు' అన్న పచ్చి అబద్ధపు అభియోగమే నన్ను అమితంగా బాధించింది. ఇంతకు ముందు కూడా సొసైటీ స్వీపరు ఉద్యోగం నుండి నన్ను తొలగించింది. ఇలాంటి అబద్దపు సాకుతోనే, నా అంగవైకల్యం ఉద్యోగ నిర్వహణకు అవరోధమా ? లేక నా వికృతాకారాన్ని చూసి సహించలేక పోవడమా ? నేను బ్రతకడానికి అనర్హుణ్ణా ? 'ఆకలి గొన్న వాడికింత తిండి కావాలి. అంతే, 'ఆత్మ' వుండ కూడదు, అభిమానం అసలే ఉండకూడదు' అనుకున్నాను. నేనింకా అక్కడి నుండి కదలకపోవడంతో కాశీనాథ్ కోపం నషాళానికెక్కినట్టుంది.

నేను పదేపదే ప్రాధేయపడ్డాను. అతను ఇంకా రెచ్చి పోయాడు.

''ఎన్నిసార్లు చెప్పాలిరా రాస్కెల్ ! నువ్వొక ఫోర్జరీ గాడివి. ఫోర్ట్వంటీ గాడివి. ఇంకా నువ్విక్కడే ఉన్నావంటే 'ఫోర్జరీ' చెక్కు మార్చడానికి ప్రయత్నించాడని కేసు పెట్టి పోలీసలకు అప్పగిస్తాను, బయటకు వెళ్తావా లేదా ? '' అంటూ కోపావేశంతో సీట్లోంచి పైకిలేచి , నా చేతిలోని ప్లాస్టిక్ ఫోల్డరును లాక్కుని దూరంగా విసిరేశాడు. అంతటితో ఆగక నా కాలరు పట్టుకుని బలవంతంగా నెట్టాడు. నేను విసురుగా వెళ్ళి సోఫా మీద పడ్డాను. నా బరువుకు, అతను తోసిన ధాటికి సోఫామీదున్న ఆచ్ఛాదనలు తొలగిపోయి చిందరవందరగా కింద పడ్డాయి. దీంతో కాశీనాథ్ ఆవేశం కట్టలు తెంచుకుంది. పిచ్చి కుక్కలా ప్రవర్తించాడు. సోఫా మీద పడున్న నన్ను కాలరు పట్టుకుని లేపి ''యూ బాస్టర్డ్ ! నువ్వు వెంటనే వెళ్ళకపోతే చంపేస్తాను. ఫోర్జరీ గాడికి ఎంత పొగరు ? ఎంత అహంకారం ? .. ..'' ఇంకా తిట్టబోయే ప్రయత్నం చేస్తుండగా 'ఫోర్జరీ గాడివి' అన్న మాట విన్న నాకు మృగత్వం ఆవహించింది. గోవు లాంటి నేను వ్యాఘ్రంగా మారాను. నా కాలరు పట్టుకున్న కాశీనాథ్ చేతి పట్టు విడిపించుకుని విసురుగా తోశాను. ఆ తోపుడుకు కాశీనాథ్ ఎగిరి మరో సోఫామీద పడి పాము పడగ విసిరినంత వేగంగా లేవబోయాడు. ''నేనతన్ని లేవనీయలేదు. అతడికేసి కాల్చేశాలా చూస్తూ రేయ్ కాశీనాథ్ ! నువ్వేరా బాస్టర్డ్‌వి. నీలో అసలు మానవత్వముందా ? ఖరీదైన గదిలో, ఖరీదైన కుర్చీలో కూర్చున్నావు. ఖరీదైన హోదాలో ఉన్నావు. ఖరీదైన సూటు వేసుకున్నావు. నీ ప్రవర్తన కూడా నీ హోదాకు, కార్పొరేట్ ఇమేజ్‌కి 'సూటు' అయేటట్టు చూసుకో ! థూ ! నీవు నాకు సహాయం చేయకపోతే పోనీ ! నన్ను అనవసరంగా , నిరాధారంగా 'ఫోర్జరీ గాడివి' అనడానికి నీకెవ్వరధికారమిచ్చారు ? నేను పేదవాణ్ణని, వికృతాకారుణ్ణి అనేగా ? అయినా నేనూ మనిషినే, అంటూ నేను గ్లాసు డోరు తోసుకుంటూ బయటకొచ్చాను.

లోపల జరిగిన సంఘటనను క్యాబిన్ అద్దాల్లోంచి బయటనుం చి చూస్తున్న కస్టమర్లు, సిబ్బంది బొమ్మల్లా నిలబడి ఉన్నారు... ఈ ఇద్దరిలో ఎవరిది వికృతమైన రూపమో తేల్చుకోలేక అనుకుంటాను..

*

# పులి - మనిషి

పరిగెత్తాను, పరిగెత్తాను
నిలకడ కోసం పరిగెత్తాను
ఎదలో దాచుకున్నానని
నమ్మ పలికిన అరణ్యం
స్వార్థపు నిప్పుతో కాలుతుంటే
గుహలు లేక దాగే పొదలు లేక
తినడానికి లేడి పిల్లలు లేక
పరిగెత్తాను పరిగెత్తాను
నిలకడ కోసం పరిగెత్తాను
చుట్టూ వెంటాడే వారే
వేటాడే వారే!
పరిగెత్తాను పరిగెత్తాను
నిలకడ కోసం సాగించే
నిత్య పోరాటమేగా జీవితం!
పరిగెత్తి పరిగెత్తి
చివరికి సంపాదించా నొకచోటు-
సురక్షితమైన చోటు –
ఇప్పుడు నాకు భయం లేదు
నేను జనారణ్యంలో ఉన్నాను
జనం గుండెల్లో కొలువై ఉన్నాను
ఇక నన్ను వెంటాడేదెవ్వరు?
వేటాడేదెవ్వరు?



-ఎల్.ఆర్.స్వామి

సెల్: 99490 755597